క్లుప్తంగా

మహిళలకు అండగా వన్ స్టాప్ సెంటర్



మాట్లాడుతున్న వన్‌స్టాప్ సెంటర్ కౌన్సెలర్ రమాదేవి

గంట్యాడ: ఆపదలో ఉన్న బాలికలు, మహిళలకు వన్ స్టాప్ సెంటర్ అండగా నిలుస్తుందని వన్‌స్టాప్ సెంటర్ కౌన్సెలర్ కిల్లాడ రమాదేవి అన్నారు. మండలం లోని లక్కిడాం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు వన్ స్టాప్ సెంటర్ సేవలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలిక లు, మహిళల రక్షణతో పాటు వారి ఆరోగ్య సంరక్షణకు వన్ స్టాప్ సెంటర్ సహాయపడుతుందన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు కానీ, పోలీసులకు కానీ సమాచారం అందించాలని సూచించారు.వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. హెచ్‌ఎం ఎం.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: మండల వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు దత్తి చిరంజీవి ఇంట వంగర గ్రామంలో శనివారం జరిగిన వివాహ వేడుకకు గజపతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకకు హాజరైన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను, నాయకులను పలకరించారు.

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐ మహేష్, ఎంపీపీ చలంనాయుడు, తదితరులు

బొండపల్లి: మాదకద్రవ్యాలకు బానిసలైతే జీవితాలు సర్వనాశనమవుతాయని ఎస్‌ఐ యు.మహేష్ హెచ్చరించారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల స్థాయిలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని చెప్పారు. కష్టపడి చదువుకున్నవారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం డ్రగ్స్‌తో కలిగే అనర్థాలను వివరిస్తూ ముద్రించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఎంపీపీ చల్లా చలంనాయుడు, వైస్ ఎంపీపీ గొండేల ఈశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు బి.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

శృంగవరపుకోట: సమాజమైనా, వ్యక్తి అయినా అభివృద్ధి సాధించాలంటే చదువు ఒక్కటే సాధన మార్గమని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు.జామి మండలంలోని కుమరాం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఉపాధ్యాయులు–తల్లిదండ్రుల ఆత్మీయసమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. పాఠశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు హెల్త్‌కార్డులు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. తల్లిదండ్రులకు ముగ్గులు, ఆటలపోటీలు నిర్వహించారు. డీఈఓ మాణిక్యం నాయుడు, జెడ్పీటీసీ సరయు, సర్పంచ్ పి.ఆదిలక్ష్మి, ఎంపీటీసీ కె.పద్మావతి, అధికారులు పాల్గొన్నారు.

- శృంగవరపుకోట: ధర్మవరం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ మీటింగ్‌కు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అతిథిగా హాజరయ్యారు.
- లక్కవరపుకోట/ వేపాడ: ఎల్.కోట మండలంలోని జమ్మాదేవిపేటలోని జ్యోతిరావుపూలే బాలికల గురుకుల పాఠశాలలో, వేపాడ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశాలకు ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అతిథిగా హాజరయ్యారు.

పంటకోత ప్రయోగం

డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో రైతు కె.వెంకటసూర్యనారాయణరాజు వరి పంటపొలంలో విజయనగరం ఏరువాక కేంద్రం సమన్వయకర్త కెల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మార్టేరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం సిబ్బంది శనివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో ఈ ప్రయోగం చేయగా 17 కిలోల ధాన్యం దిగుబడి వచ్చినట్లు సదరు సిబ్బంది అంచనా వేశారు. ఈ లెక్కన ఎకరాకి 26 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో పూడి నిర్మల, ఏఈవో బి.రామకోటి తదితరులు పాల్గొన్నారు.



చిన్నరావుపల్లి ఫ్లైఓవర్ మధ్యలో తేలిన గోతులు, ప్రమాదకరంగా ఉన్న ఇనుప ఊచలు



చిన్నరావుపల్లి ఫ్లైఓవర్‌పై శిథిలమైన ఫుట్‌పాత్



తుమ్మికాపల్లి ఫ్లైఓవర్‌పై పాడైన ఫుట్‌పాత్

శిథిలం.. ఛిద్రం

- ప్రమాదకరంగా రైల్వే ఫ్లైఓవర్లు
- వంతెనలపై గోతులు ఏర్పడి పైకితేలిన ఇనుప ఊచలు, శిథిలమైన ఫుట్‌పాత్‌లు
- ఫ్లైఓవర్లపై ఇరువైపులా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు



తుమ్మికాపల్లి వంతెనపై పిచ్చిమొక్కలు



చిన్నరావుపల్లి వంతెనపై శిథిలమైన రక్షణ గోడ, పిచ్చిమొక్కలు

కొత్తవలస: మండలంలోని చిన్నరావుపల్లి,తుమ్మికాపల్లి గ్రామాల సమీపంలోని రైల్వే ఫ్లైఓవర్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. రోడ్డు గోతులు తేల డం, ఇరువైపులా ఉన్న రక్షణ గోడలు, ఫుట్ పాత్, బెర్ములు శిథిలం కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఈ మార్గంలో ప్రయాణించే వారు హడలిపోతున్నారు. ఈ వంతెనలపై సాధారణ రోడ్లను తలపించేలా పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనా లు కనిపించక తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

తుమ్మికాపల్లి ఫ్లైఓవర్:

1.2 కిలోమీటర్ల పొడవైన ఈ వంతెనను 2013లోనే ప్రారంభించారు. కొన్నాళ్లుగా వంతెన నిర్వహణ పనులను పూర్తి గా గాలికి వదిలేశారు. బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న ఫుట్ పాత్ పూర్తిగా శిథిలమైంది. ఫుట్ పాత్‌పై సిమెంట్ పలకలు పగిలిపోయి, గోతులు తేలడంతో నడిచివెళ్లడానికి వీలులేకుండా పోయింది. లైటింగ్ సిస్టమ్ కూడా పాడైంది. లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన ఐరన్ పోల్స్‌కు పిచ్చితీగలు అల్లుకున్నాయి. ఈమార్గంలో కొత్తవలస నుంచి దేవరాపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సులతో పాటు ఇతర వాహనాలు ప్రయాణిస్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.

చిన్నరావుపల్లి ఫ్లైఓవర్ :

1.3 కిలోమీటర్ల పొడవైన ఈఫ్లైఓవర్‌ను 2013వ సంవత్సరంలో అప్పటి కేంద్రమంత్రి పురందేశ్వరి ప్రారంభించారు. వంతెనపై గతంలో అధికారులు ఎప్పటికప్పుడు నిర్వ హణ పనులు చేయించేవారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికా రంలోకి వచ్చిన నాటి నుంచి నిర్వహణ పనుల ఊసే ఎత్తలేదు. సరిగ్గా వంతెన మధ్యలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. రాత్రివేళల్లో ద్విచక్రవాహన చోదకులు ఈ గోతుల వద్ద అదుపుతప్పి పడిపోయిన సంఘటనలూ అనేకం ఉన్నాయి.వంతెనకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయాయి. ఈ మార్గంలో నిత్యం అనకాపల్లి నుంచి కొత్తవలస మీదుగా విజయగనరం జిల్లా కేంద్రానికి ఆర్టీసీ బస్సులతో పాటు, వందలాది వాహనాలు, శారడ కర్మాగారానికి పెద్దపెద్ద లోడ్‌లతో లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి.



తుమ్మికాపల్లిలో లైటింగ్ కోసం ఏర్పాటు చేసిన స్తంభంపైకి ఎగబాకిన పాదులు

అధికారులు పట్టించుకోవడంలేదు

చిన్నరావుపల్లి ఫ్లైఓవర్‌పై గోతులు తేలి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. గోతుల్లో పడి ఎంతో మంది ద్విచక్రవాహన చోదకులు గాయాలపాలవుతున్నాయి.అయినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఇంత అధ్వాన పరిస్థితి గతంలో చూడలేదు. రోడ్లను బాగు చేసేస్తున్నాం అంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో పరిస్థితికి పొంతన లేదు. నిర్వహణ పనులను విస్మరించడం వల్ల 15 ఏళ్లు కాకుండానే 60 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన మాదిరిగా తయారైంది.

– పెదిరెడ్ల శ్రీనివాసరావు, కొత్తసుంకరపాలెం, కొత్తవలస మండలం

త్వరలోనే పనులు చేపడతాం



రైల్వే ఫ్లైఓవర్లపై పిచ్చిమొక్కలు పెరగడం, గోతులు తేలడం వాస్తవమే. జంగిల్ క్లియరెన్స్‌కు ప్రభుత్వం ఇటీవలే టెండర్లను పిలిచింది. వారం రోజుల్లో జంగిల్ క్లియరెన్స్ చేపడతాం. అలాగే గోతులను పూడ్చి ప్రమాదాల నివారణకు కృషి చేస్తాం.

– శ్రీనివాసరావు, అర్అండ్‌బీ డీఈ

నేరాల నియంత్రణకు చర్యలు

- డీఎస్పీ శ్రీనివాసరావు

లక్కవరపుకోట: నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ప్రధాన జంక్షన్లలో, రోడ్లపై మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని విజయన గరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. పెండింగ్ కేసుల వివరాలను, ఇతర రికార్డులను, ఫిర్యాదుదారులకు అందించే రసీదులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ఆర్అండ్‌బీ అధికారులతో సమన్వయం చేసుకుని స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్రగ్స్,గంజాయి రవాణా, వినియోగం, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, సైబర్ నేరాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో, విద్యాలయాల్లో పోలీస్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇటీవల బదిలీలు అయిన పోలీస్ సిబ్బందికి త్వరలోనే పూర్తిస్థాయిలో రిలీవ్ చేసి వారు బదిలీ అయిన స్టేషన్లలో జాయిన్ అయ్యేలా చూస్తామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ నవీన్‌పడాల్ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే ఎలా..?

కొత్తవలస: గ్రామాల్లో నిత్యం పారిశుద్ధ్య పనులు చేస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు పాటుపడుతున్న కార్మికులకు నెలల తరబడి వేతనాలు ఇవ్వకపోతే వారు తమ కుటుంబాలను ఎలా నెట్టుకొస్తారని సీఐటీయూ నాయకులు మద్దిల రమణ, గాడి అప్పారావు ప్రశ్నించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద వివిధ గ్రామాల పారిశుద్ధ్య కార్మికులతో కలిసి శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు చాలీచాలని వేతనాలు చెల్లిస్తున్నారని, ఆ వేతనాలను కూడా అయిదారు నెలలుగా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల శ్రమను దోచుకుంటోందని, వారితో వెట్టి చాకిరీ చేయించుకుంటోందని ఆరోపించారు. పారిశుద్ధ్యకార్మికులకు సన్మానాలు చేసేస్తే వారి ఆకలి తీరదని, నెలనెలా జీతాలు ఇస్తేనే ఇల్లు గడుస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు.



మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు

యజ్ఞశాల నిర్మాణానికి శంకుస్థాపన

చీపురుపల్లి: మండలంలోని పత్తికాయవలస గ్రామంలో ఆర్యసమాజ యజ్ఞశాల నిర్మాణానికి జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం శంకు స్థాపన చేశారు. గ్రామానికి చెందిన దన్నాన నీలకంఠంనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు శంకరరావు, జనార్దన్ యజ్ఞశాల నిర్మాణానికి ముందు కు వచ్చారు.కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనా యుడు, మీసాల వరహాల నాయుడు, వలిరెడ్డి లక్ష్మణరావు, కోరుకొండదాల య్య,కర్రోతు ప్రసాద్, దన్నాన శంకరావు ,కుమరాపు అప్పలనా యుడు, రేగాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

స్థానిక ప్రజాప్రతినిధులను గౌరవించాలి

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ రఘురాజు

లక్కవరపుకోట: స్థానిక ప్రజాప్రతినిధులను గౌరవించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులు సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే చేపట్టాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీ పీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివా రం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన అతిథిగా హాజరయ్యారు. ముందుగా అధికారులు శాఖల వారీగా ప్రగతి నివేదికలు, గత సమావేశంలో సభ దృష్టికి వచ్చిన సమస్యల్లో పరిష్కరించిన వాటి వివరాలను చదివి వినిపించారు. సమావేశానికి ఆర్అండ్‌బీ, అటవీశాఖ, ఆర్టీసీ, తదితర శాఖల అధికారులు హాజరు కాకపోవడంపై ఎంపీపీ అసహనం వ్యక్తం చేశారు. గోకులం షెడ్లను అధికార పార్టీ వారికే మంజూరు చేస్తే ఎలా అని ఉపాధి హామీ ఏపీఓ విజయలక్ష్మిని నిలదీశారు. పీఆర్ జేఈ వీరలక్ష్మి పంచాయతీరాజ్ శాఖలో ఇటీవల ప్రారంభించిన రోడ్లు, భవనాల నిర్మాణం, తదితర పనులు గురించి వివరిస్తుండగా ఆమెకు ఎంపీపీ పలు ప్రశ్నలు వేశారు. పంచాయతీరాజ్ శాఖ పనులను ఎవరు చేస్తున్నారు, పనులకు సర్పంచ్‌లు ఆమోదం ఉందా అని ప్రశ్నించగా.. వెండర్ విధానంలో చేయిస్తున్నామని జేఈ బదులిచ్చారు. సర్పంచ్‌ల ఆమోదం లేకుండా ఎలా పనులు చేస్తారని, అధికారులకు ఈపద్ధతి తగదని ఎంపీపీ అన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీలు తీర్మా నించిన పనులనే చేపట్టాలని అన్నారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరయ్యే పనులను సర్పంచ్‌ల ఆమోదంతోనే చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉపాధి హామీ పీడీతో ఫోన్‌లో మాట్లాడి సర్పంచ్‌లు అమోదంతోనే పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీడీఓ ఎస్.అప్పారావు, వైస్ ఎంపీపీ శ్రీనురాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు

పొగడ్తల కోసం సమావేశాలా..?

- కూటమి నేతలను,ఉపాధ్యాయులను నిలదీసిన పేరెంట్స్
- తల్లిదండ్రులకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వని మీటింగులెందుకు!
- మధ్యాహ్న భోజనం అస్సలు బాగుండడం లేదు..



ఉపాధ్యాయులను నిలదీస్తున్న విద్యార్థి తండ్రి

చీపురుపల్లి: పేరెంట్స్ – టీచర్స్ సమావేశం ఎందుకు పెట్టారు... మమ్మల్ని పిలిచి మాట్లాడే అవకాశం కూడా ఇవ్వరా.. మీలో మీరు పొగుడుకునేందుకు మమ్మల్ని ఎందుకు పిలిచారు...?మాకు పని లేక వచ్చామనుకున్నారా? ఇక్కడ మధ్యాహ్న భోజనం అస్సలు బాగోడం లేదు. మూడు రోజుల కిందటే భోజనంలో పురుగులు వచ్చాయి. పిల్లలకు ఏమైనా అయితే ఎవరు బాధ్యత వహిస్తారు? అంటూ చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం జరిగిన సమావేశంలో విద్యార్థినిల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు, కూటమి నేతలను నిలదీశారు.

● ఎలా వెళ్లిపోతారు..

సమావేశంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రౌతు కామునాయుడు, జనసేన నియోజకవర్గ అధ్యక్షుడు విజనగిరి శ్రీనివాసరావు ప్రసంగించి వెళ్లిపోతుండగా తల్లిదండ్రులు ఎదురుగా వచ్చి సమస్యలు వినకుండా వెళ్లిపోడానికి వచ్చారా? అంటూ ప్రశ్నించారు. ఈ పాఠశాలలో చాలా సమస్యలు ఉన్నాయని నిలదీయడంతో, ఏమైనా సమస్యలుంటే కాగితంపై రాసి ఇవ్వాలని కూటమి నేతలు చెప్పి అక్కడ నుంచి వెళ్లిపోయారు.

● ప్రతిజ్ఞను అడ్డుకున్న తల్లిదండ్రులు

మెగా పేరెంట్స్ డే మీటింగ్‌కు స్పెషల్ ఆఫీసర్‌గా ఐసీడీఎస్ పీఓ హాజరయ్యారు. ఆమె ప్రతిజ్ఞ చేయించేందుకు సిద్ధమవ్వగా తల్లిదండ్రులు అడ్డుకున్నారు. తల్లిదండ్రులు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వకుండా ప్రతిజ్ఞ చెప్పించి సమావేశం ముగిస్తారా? అంటూ ప్రశ్నించారు. తల్లిదండ్రులకు మాట్లాడేందుకు అవకాశం ఇవ్వనప్పుడు తమను ఎందుకు పిలిచారని నిలదీసారు. చివరిలో తల్లిదండ్రులు మాట్లాడేందుకు అవకాశం ఇస్తామని హెచ్‌ఎం సర్ది చెప్పడంతో కాసేపటి తరువాత ప్రతిజ్ఞకు అంగీకరించారు.

బహుళ పంటల సాగుతో ఆహార భద్రత


- ప్రకృతి వ్యవసాయం ఆర్‌టీఓ హేమసుందర్



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌టీఓ హేమసుందర్

వేపాడ: ఆహార భద్రతతో పాటు నిరంతర ఆదాయం కోసం ప్రకృతి వ్యవసాయ విధానంలో బహుళ పంటలను సాగు చేయాలని ప్రకృతి వ్యవసాయం రీజినల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ అన్నారు. మండలంలోని కొండగంగుబూడి గ్రామంలో సబల్ ప్రాజెక్టు, రెయిన్ ఫారెస్ట్ అలియన్స్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుళ పంటల సాగుతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు.ఆహార భద్రత, ఆరోగ్యభద్రత, ఆర్థిక భద్రత, పశుగ్రాస భద్రత, పర్యావరణ భద్రత ఉంటుందని, భూమి సారవంతంగా ఉంటుందని చెప్పారు. ప్రతీ రైతు పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. సబల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ శ్రావణి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సాహం అందిస్తామని తెలిపారు.అనంతరం కొండగంగుబూడితో పాటు సమీప గ్రామాల రైతులకు నవధాన్యాల విత్తనాలను పంపిణీ చేశారు. సుస్థిర వ్యవసాయ కేంద్రం కో– ఆర్డినేటర్ వెంకటరావు, ఆర్‌వైఎస్‌ఎస్, సీఎస్‌ఏ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ



వీఆర్‌ఓ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దత్తిరాజేరు: మండలంలోని వంగర గ్రామ వీఆర్‌ఓ సింహాచలం శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. స్వగ్రామం మరడాంలో శనివారం అంత్యక్రియలు జరిగాయి. మృతుడి కుటుంబ సభ్యులను మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ మంత్రి అప్పలనాయుడు, దత్తిరాజేరు, చుక్కపేట మాజీ సర్పంచ్‌లు మహదేవ్ ఫణీంద్రుడు, చుక్క మురళి, నాయకులు పోతల శంకరరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు



లక్కవరపుకోట: ఎల్.కోటలో పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్య స్వామి



కొత్తవలస: మంగళపాలెంసుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



వేపాడ: బానాదిలో సుబ్రహ్మణ్య స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



చీపురుపల్లి: నాగంపేటలో శ్రీవల్లీ దేవసేన, సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం జరిపిస్తున్న ఆలయ ధర్మకర్త, భక్తులు

కొత్తవలస/లక్కవరపుకోట: కొత్తవలస మండలం, మంగళపాలెం గ్రామ సమీపంలోని విఘ్నేశ్వర, అయ్యప్ప, సుబ్రహ్మణ్య స్వామి సహిత రాజరాజేశ్వరీదేవి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీవల్లీ దేవసేన, సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. అలాగే లక్కవరపుకోట మండల కేంద్రంలోని వీరభద్ర స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాన్ని పురోహితులు శ్రీహరిశర్మ జరిపించారు.

వేపాడలో..

వేపాడ: మండల కేంద్రంతో పాటు బానాది గ్రామంలో సుబ్రహ్మణ్య షష్టి పూజలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల అర్చకులు గోపాజోస్యుల సాయిశర్మ, మేడపాటి కిశోర్‌శర్మ స్వామి వారికి అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

నాగంపేటలో

చీపురుపల్లి: మండలంలోని నాగంపేట వద్ద సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్టి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం శ్రీవల్లీ దేవసేన, సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం జరిపించారు. ఆలయ ధర్మకర్త కె.త్రిమూర్తులరాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.